# చీకటి గదులు

## "త్రిపుర"

ఈ షన్ను ఊడదు. సలుపు మానదు. కుడిచేతి మాపుడు వేలుతో నొక్కితే ఎక్కడలేని సుఖం ఆ బాధలో. గేటు తోసుకుని లోపలకు వెళ్ళాను.

బార్వే అందంగా, జ్వరంతో పడుకొని ఉన్నాడు. మాగడ తెలుపు దిండుల మీద సింహం తల. మెడదాకా రొజాయి కప్పి ఉంది.

"ఎలా ఉంది?" అన్నాను కూర్చుంటూ.

"ఉదయం తగ్గింది. ఇప్పుడు మళ్ళీ 103."

"చలిలో—"

"చలికాదు. మనస్సులో కల్మషం ఉంటే దేహానికి జబ్బు. ప్రయత్నిస్తున్నాను. రేపటికి తగ్గిపోవాలి."

బార్వేకి చాలా సిద్ధాంతాలు ఉన్నాయి. వాటిల్లో ఇదొకటి. కాని సిద్ధాంతాల పట్టాల మీద జీవితాలు నడిపించే వారిని చూస్తే బార్వేకి పడదు. ముక్తాదేవి చనిపోయి అతన్ని చాలా మార్చేసింది.

"మందేమేనా—"

బార్వే మూలిగాడు విసుగ్గా, తల అటువేపు తిప్పి. శాంత ట్రేలో టీ పట్టుకొచ్చి పెట్టింది. ముద్దబంతి పువ్వు. లోపలే నవ్వుతుంది. చిన్న వయస్సులోనే కళ్ళల్లో 'ఆత్మ' వికసించింది. ఏ తలుపు తెరుచుకుని, ఏ వెంతురు ప్రవేశించిందో? ముక్తాదేవే చనిపోయి శాంతలో ఉందంటాడు బార్వే. శాంత తోటలోకి వెళ్ళింది.

"కాలేజీకి సెలవు పెట్టావా?"

తలతోనే అవునన్నాడు.

టీ కప్ తీసుకున్నాను.

"కల్యాణి రేపు వస్తుంది. అన్నీ తెగగొట్టుకుని" అన్నాడు ఎదురుగా గోడవేపు చూస్తూ. ఎట్టిటి మధ్యాహ్నంలో ఒక్కసారిగా మేఘాలు కమ్ముకున్నట్లయింది. ఎక్కడో తలుపొకటి నిశ్శబ్దంగా తెరుచుకుంది మళ్ళీ.

బార్వే బాధపడుతున్నాడో, లేక.....

మాటలు దేన్ని వ్యక్తపరచగలవు? ఇటుకల్లాగ ప్రాణం లేకుండా కట్టుకుపోతాయి.

"రేపు ఉదయం తుఫాన్‌లో" అన్నాడు.

శాంత తోటలో మొక్కలకి నీళ్ళు పోస్తుంది.

"నన్ను వెళ్ళమంటే—"

బార్వే జవాబివ్వలేదు. గోడ వేపే చూపు. శాంతని పిలిచేను. కుర్చీలో కదిలాను ఏదో నిశ్చయానికి వచ్చినట్లు.

"రేపు ఉదయం నాకు పనిలేదు. వెళ్ళగలను. కల్యాణి కళ్ళల్లో ఆశ్చర్యం మిలియన్ డాలర్లతో సమానం."

బార్వే గోడ వేపు చూపు జిడ్డు కృష్ణమూర్తి ఫోటో వేపు మరల్చాడు.

శాంత వచ్చింది చేతులు తుడుచుకుంటూ.

"తుఫాన్ ఎన్నిగంటలకి మొగల్‌సరాయ్ చేరుతుందో చూడు శాంతా" అన్నాను. బార్వే గోడ చూపు అర్థం తెలుసు నాకు. ఇతరుల మీద దేనికేనా ఆధారపడడం గుండె కోత.

శాంత బ్రాడ్షా తీసుకొచ్చి కూచుని పేజీలు తిప్పింది.

"మూడూ ముప్పయి" అంది బ్రాడ్షా చూస్తూ.

"అయితే, యీ రాత్రే పాసెంజర్‌లో వెళ్ళాలి. పదకొండు గంటల కనుకుంటాను." అన్నాను శాంతతో.

బార్వే కళ్ళు మెరుస్తున్నాయి. ఆ కళ్ళల్లో నీళ్ళు రావడానికి ఎంతో సమయం పట్టదు. ముక్తాదేవి చనిపోయి బార్వేని శిథిలం చేసింది. ఆఖరి రోజుల్లో బార్వే ఏమీ చెయ్యలేక పోయాడు. Zen Buddhism చదువుతూ, మరణ సమయంలో బార్వేని దూరంగా ఉంచింది. తను కట్టుకున్న గూడులో చనిపోయింది. బార్వే అవసరం లేకపోయింది ఆమెకు. కల్యాణి దూరమయిపోయింది. శాంత చిన్నపిల్ల.

"అర్ధరాత్రి చిన్న ప్రయాణం, చలిలో. చాలాకాలం అయింది. ఆత్మ పరిశోధించుకుందుకు. ఎక్కువా తక్కువా కాకుండా సమానంగా సరిపోయే వ్యవధి. నాలుగు గంటలు." అన్నాను.

బార్వే ఆలోచనల గొలుసు తెగింది. నీరసంగా నవ్వేడు.

"బాధప్రదం." అన్నాడు.

"అట్లాస్ భుజాలు నావి. సిడ్నీ కార్టన్. ముళ్ళకిరీటం. ఎలీ ఎలీ లామా సబచ్ థానీ." అన్నాను పేక కలిపినట్లు, అన్నీ కలుపుతూ.

పైకి వచ్చాను. శాంత కూడా వచ్చింది. తోట గేటు దగ్గర నిలబడ్డాం.

"అక్కడ వేసిన గులాబీలు చూశారా?—ఎలా ఉన్నాయి?" అంది.

"అక్క వేసిన గులాబీలు చూస్తున్నాను. చాలా బాగున్నాయి." అన్నాను శాంత వేపు చూస్తూ.

"నువ్వు బంతిపువ్వువి. నీకు ముళ్ళు లేవు." అన్నాను శాంత జడలు పీకుతూ.

"మీకు ముళ్ళు గుచ్చుకోవడం ఇష్టం" అంది, పన్నెండేళ్ల వయస్సు తెలివితో, వార్నిష్‌ని గోకి, క్రిందని ఏముందో చూసే తెలివితో. అమాయకత్వపు చీకటికో దీపాలు వెలిగిస్తూంది. పచ్చటి పొలాల్లో తెసుళ్ళ పుడతాయి...నీరు లేక బీటలు వారుతుంది నేల....

"నువ్వు కూడా వస్తావా మొగల్‌సరాయ్?" అడిగాను.

"రాత్రి ఎనిమిదింటికే నిద్రపోతాను. నన్ను మొయ్యాలి దోవంతా." లాలీపాప్ లాగ ఉన్న తనని భుజం మీద వేసుకుని మొయ్యడం ఊహించుకుంది కాబోలు, పకపక నవ్వింది.

"నువ్వు నవ్వితే ఎలా ఉంటుందో చెప్పమంటావా?"

తల ఊపింది.

"ఒక చిన్న అడివి. పెద్దపెద్ద చెట్లు లేవు అందులో. లతలు, అడివి పువ్వులు. అందులో సెలయేరు ఒకటి వంకలు తిరుగుతూ పారుతూంది. ఇసుక. బురద లేదు. పైనుంచి చూస్తే చిన్న గులకరాళ్లు కూడా కనిపిస్తాయి. మెల్లగా కదులుతుంటాయి. అక్కడక్కడ పెద్దరాళ్లు కూడా, తెల్లగా, గుండ్రంగా. నీళ్ల ఎక్కువ లేనప్పుడూ ఉన్నప్పుడూ పాయలుగా పారుతుంది. గులకరాళ్ల తెల్లగా మెరుస్తూంటే, వాటి మీద నీరు పారుతూంటే, మలుపులు తిరుగుతూ, గలగల శబ్దంచేస్తూ, తుళ్లుతూ—"

"మలుపులు దగ్గర దగ్గరగా ఉంటాయా? దూరంగానా?" అంది శాంత.

"ఆ నీటి మీద పక్షులు,. నీలిరంగు రెక్కలు. ఆ రెక్కల మీద—"

"అవి గూళ్లు ఎక్కడ కట్టుకుంటాయి?"

"ఆ నీట్లో చేపలు—"

"పులులో?"

"ఖాండ్రుఖాండ్రు మంటాయి. అలాఉంటుంది నీ నవ్వు" అన్నాను, తోట గేటు తలుపు తీసి పైకి వెళుతూ.

రోడ్ మీదికి వచ్చాను. మఱ్ఱిచెట్టు. గబ్బిలాలు రొద చేస్తున్నాయి. రోడ్ మీద నీడలు. మఱ్ఱిచెట్టు క్రింద చలి. కాంతి లేదు. ఇక్కడే అడిగింది ముక్తాదేవి ఆరునెలల క్రితం. అప్పటికే ఆవిడ గుండెజబ్బు చాలా ముదిరి ఉంది. ఆ రాత్రి ఇక్కడ దాకా వచ్చింది నాతో, నా చెయ్యి పట్టుకుని. గబ్బిలాలు తిరిగాయి మా చుట్టూ. మలుపు దగ్గర లాంప్ పోస్ట్ చుట్టూ పురుగులు తిరిగాయి, రెక్కలు కాల్చుకుంటూ. రజనీగంధపు పువ్వుల పరిమళం ఒక్కసారిగా ఆ వేసవి రాత్రి గాలిలో కలిసి ప్రభవిల్లింది. జబ్బుతో, ఆవేదనతో పాలిపోయిన ముఖం. హృదయపు లోతులూ, మూలమూలలూ శోధించి నిజాన్ని తెలుసుకోగలవు ఆ కళ్లు. బాల్యంలో అనాథ శరణాలయపు జీవితం చూసిన కళ్లు అవి. బార్వేని మనిషిని చేసినవి ఆ కళ్లే. ఆ కళ్లతోనే నావేపు చూస్తూ అడిగింది—"కల్యాణిని పెళ్లి చేసుకోకూడదా" అని.

నాలుగుగంటల శీతాకాలపు ఎండ ఎవరో తెలియని దేవుడి ఆశీర్వాదంలా ఉంది. సిగరెట్ తీసి వెలిగించి, నడవడం మొదలు పెట్టాను. వారణాసి వీథుల్లో నడవడం, శీతాకాలంలో ఎండలో సాయంకాలం నడవడం ఒక అనుభవం. అలవాటు. ఎన్ని అలవాట్లు కూడబెడితే జీవితాన్ని నింపుతాయి?

దుర్గాకుండ్ దగ్గర కోతులు. కాందిశీకుల దుకాణాలు. చెట్లనీడలు. పావురాలు. సైకిళ్ల గంటలు. గల్లీలు. దగ్గర దోవలు. నడక ఒక అలవాటు. గుడిగంటలు. ఎన్నివేల మైళ్లు నడచాను వారణాసిలో, యీ ఎనిమిదేళ్లలో. రాజదార్లు వదిలి, గల్లీల్లోంచి నడుస్తూ గంగ ఒడ్డుకు వచ్చాను. ఇక్కడే నా యిల్లు.

నా యిల్లు! పొలాల మధ్య, 'ప్రపంచం అంచుల్లో' అని అనిపించే యీ స్థలంలో యీ యిల్లు, నేనూ, పరశూ. గట్లు మించి నడిచి చేరాను నా యింటికి. వర్మ 'గురువుగారు పట్నానికి దూరంగా ఉండాలి' అని 'భక్తి'తో నన్ను ఉండనిచ్చిన యిల్లు. వర్మ హృదయంలో కవి! నా జీవితాన్ని ఒకవిధంగా అతను ఊహా ప్రపంచంలో నిర్మించుకున్నాడు.

పరశూ కాంపౌండ్‌లో మొక్కలకు నీళ్లు పోస్తున్నాడు. తోటపని చిన్నప్పట్నుంచీ తెలుసునంటాడు. బంతి మొక్కలు తప్ప ఏవీ పెంచలేడు. డేలియాలు మూలుగుతున్నాయి అర్ధప్రాణంతో. డయాంథస్ లేవేలేదు. మందార చెట్టు మాత్రం ఓదార్పుగా, నిలబడి ఉంది అప్పుడప్పుడు పువ్వులు పూస్తూ.

లోపలకు వెళ్లాడు పరశూ నన్ను చూసి, టీ చెయ్యడానికి.

గదిలో సాయంకాలం బరువుగా పరుచుకుని ఉంది. కిటికీ లోంచి గంగ. ఇక్కడ గంగకి అందం లేదు.

చలిగాలి వేస్తూంది.

సోఫా మీద కూర్చుని జోళ్లు విప్పుకున్నాను. మేజోళ్లు చిరిగి కన్నాలు. కాళ్లు జాపేను. పరశూ టీ పట్టుకొచ్చాడు. 'లీడర్' పత్రిక పక్కని పెట్టాడు. చెయ్యి నడుం మీద పెట్టుకుని 'టిఫిన్ ఏమేనా చెయ్యమన్నారా' అని అడిగాడు. పరశూని అలా చూస్తుంటే పెద్దగా నవ్వాలనిపించింది.

"బిస్కెట్లున్నాయా?"

"లేవు."

"తరవాత లంకకు వెళ్లి తీసుకురా" అన్నాను.

పత్రిక తిరగేసి పక్కని పడేశాను.

సాయంకాలపు నీడ చలిగా పుస్తకాల బీరువాల మీద పడుతూంది. మనసులో మంటలు లేపి, జీవితాన్ని గాలివాన చెట్లను ఊపినట్లు ఊపి, ఇప్పుడు ప్రశాంతంగా బీరువాల్లో పడి ఉన్నాయి. అప్పటి వాటి 'నిజం', 'ప్రాణం' ఇప్పుడు లేవు.

బాత్‌రూమ్‌లోకి వెళ్లి పళ్లు బ్రష్ చేసుకున్నాను. అద్దంలో పళ్లు మెరిశాయి. శత్రువు లాగ పొంచి ఉంది పుప్పి పన్ను. వీపులో బాకుతో పొడిచినట్లు పొడిచింది. బెడ్‌రూమ్‌లోకి వెళ్లి విటమిన్ 'సి' మాత్రలు నమలడం మొదలుపెట్టాను.

రాణా వచ్చినట్లున్నాడు. చిన్నగా దగ్గు వినిపించింది. రాణా చిన్నగా దగ్గడంలో స్పెషలిస్టు. నెలరోజులయింది ఖాట్మాండూ వెళ్ళి. డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చాను.

రాణా కూర్చుని ఉన్నాడు. లేచాడు. నేపాలీ కళ్ళు ఏమీ చెప్పవు.

"ఖాట్మాండూ విశేషాలేమిటి?"

అంతా అరాచకంగా ఉందిట వాళ్ళ వ్యవహారం. పెద్దరాణా బలహీనత్వంతో జమీందారీ అంతా నాశనం అయిపోతూందిట. తన కారు పట్టుకుని వచ్చేశాడు. అందులో ఇప్పుడు వెడదామన్నాడు.

మేజోళ్ళు, జోళ్ళు. లేసులు ముడి.

ఏనుగు బాధలు ఏనుగుకి ఉన్నాయనుకున్నాను. పైకి వచ్చాం. రోడ్ దాకా నడిచాం. రాణాది బిగ్ ఫియట్. ముద్దుగా, రాణాలాగే మొద్దుగా నేలని కరుచుకుని ఉంది. చాలా విసురుగా డ్రైవ్ చేస్తున్నాడు. సిల్హౌట్ నారింజపండు రంగు ముఖం. దాని తొక్కలాగే చర్మం. కింది పెదవి కొంచం వేలాడుతుంది. మూతి పక్క నుంచి మీసం 'నాకేమీ ఆశలు లేవు' అన్నట్లు దిగజారు తుంది. అతని కర్కశత్వం, కోపం, ధృడత్వం ఎన్నోసార్లు చూసిన నాకు, ఆముఖం పైకి ఏమీ చెప్పదనీ తెలుసు.

గల్లీల్లోంచి దూసుకుంటూ రాణా యింటికి చేరేము.

డ్రాయింగ్ రూమ్‌లో లలిత్‌పూర్ బుద్ధుడు. డార్జిలింగ్ దెయ్యపు మాస్కులు. దాటుకుని లోపలకు వెళ్ళాం. తెల్లటి తలుపుల ఫ్రెంచి విండో లోంచి గంగ. గంగలో బొమ్మల్లాగ పడవలు. దూరంగా, అవతలి ఒడ్డున రామ్‌నగర్‌కోట తెల్లగా మెరుపు. చదువు కోసం, సుఖాన్నిచ్చ్వని గట్టి కుర్చీలు. టేబిల్ మీద, బౌల్‌లో ఏపిల్ పళ్ళు, బుక్‌కేసుల్లో పుస్తకాలు. మూలని 'డబ్బు చెట్టు' పైకి అల్లుకుపోతూంది. వెండివాజ్ లో ఫ్లాక్స్ పువ్వులు.

లలితాదేవి కర్టెన్ తొలిగించి, వచ్చింది. సర్పంలాగ కదలే గ్రేస్. రాణా సిగరేట్ బాక్స్ తెరిచి టేబుల్ మీద పెట్టాడు. 'ఖాట్మాండూ స్పెషల్' అని, నవ్వి, లోపలకు వెళ్ళిపోయాడు.

లలితాదేవి పుస్తకం తెరిచింది. మూడునెలల నుంచీ పుస్తకాలు తెరుస్తూంది. తెరిచి ఏమిటి నేర్చుకుంది? అద్భుతంగా పాడగలదు. ఖాట్మాండూలో గాల్ఫ ఆడుతుంది. ఇక్కడ కేంటన్ మెంట్‌లో టెన్నిస్. క్లబ్‌లో మిలిటరీ ఆఫీసర్లతో సరిగా తాగ గలదు. ఇప్పుడు ఎం. ఏ. డిగ్రీ కావాలి. ఎందుకు? ఎవరో వాళ్ళ కుటుంబంలో డిగ్రీ తెచ్చుకుంది. ఇప్పుడు తనకి కావాలి. అందుకు, నేను. చదవదు. కబుర్లు చెబుతుంది. క్లబ్ కబుర్లు. పని మనుషుల 'వ్యవహారాలు'. ఇంత 'నాగరికత ' లోనూ ఏదో పాతదనం కనిపిస్తుంది.

పుస్తకం తెరిచి, పేజీలు యిటూ అటూ తిప్పి, మూసేసింది విసుగ్గా. ఇవాళ హౌండ్ అఫ్ హెవెన్ మూడ్‌లో లేనంది. ఫ్రేన్సిస్ థామ్సన్ ఫన్నీఫెలో అంది. "ముఖ్యమైన విషయం చెప్పాలి మీకు" అంది, ముందుకు వంగుతూ.

"నిన్నరాత్రి అఖరకు ప్రతాప్ 'దాన్ని' పట్టేశాడు. నాకు తెలును యింక ఉండబట్టలేడని. అర్ధరాత్రి, డ్రాయింగ్ రూమ్ పెట్టె మీద." జ్ఞాపకం కళ్ళల్లో మెత్తగా మెదిలింది. కాళ్ళు కదిలాయి సున్నితంగా, జ్ఞాపకంతో.

డ్రాయింగ్ రూమ్‌లో గోడకి తగిలించిన దెయ్యపు మాస్కులు కనిపిస్తున్నాయి. లలిత్‌పూర్ బుద్ధుడి నేపాలీ కళ్ళు మూసుకొని ఉన్నాయి. రాణా ఎంత సుఖం యివ్వగలుగుతున్నాడు అనుకున్నాను. నెలనుంచీ ఎంతో క్రూరంగా, వంకరగా ప్రయత్నం చేస్తూంది ప్రతాప్‌ని 'దానితో కలపడానికి. ఖాట్మాండూ కొండ ల్లోంచి వచ్చాడు ప్రతాప్, పదహారేళ్ల కొండజాతి ప్రతాప్. ఇక్కడ వీళ్ళకి సేవ చెయ్యడానికి. 'అది' యిక్కడిది—లలితాదేవి సేవ కోసం. లలితాదేవి ప్రయత్నాలు రాజగృహంలోని రహస్యాలు, కుట్రలు, కుతంత్రాలు తలపింపజేస్తాయి. సాయంత్రం నాకు రోజూ చెప్తుంది. సలహా అడుగుతుంది. నన్ను!

సలహా అడుగుతుంది నన్ను. నా జీవితంలోని రహస్యాలు ఎవరికి తెలుసు? నాకు వివరంగా చెబుతారు అందరూ. నాలో ఏముంది ఇతరుల హృదయాల్నీ, జీవితాల్నీ పైకి తీసుకొచ్చే శక్తి? శక్తి అది? వింటాను. కమెంట్ చెయ్యను. నేను లేనట్లే చెప్పుకు పోతారు. నాకు యీ విషయాల్లో, యితరుల జీవితాల్లో ఆసక్తి ఉందా? గంగలో పడవలు మెల్లగా, ప్రాణం వచ్చినట్లు కదలడం మొదలుపెట్టాయి. అవతలి ఒడ్డున అక్కడా అక్కడా దీపాలు వెలుగుతున్నాయి.

"ప్రతాప్ చెడిపోయాడు పూర్తిగా. రేపే పంపించేస్తాను ఖాట్మాండూకి" అంది లలితాదేవి. ప్రతాప్ ఒక పనిముట్టు. ప్రయోజనం అయిపోయింది—ఎత్తైన కొండల మధ్య ఎవరికీ కనిపించకుండా, లోతుగా, నల్లగా, రహస్యంగా పారే ప్రవాహం లలితాదేవి. కోపం రావలసిన సమయం అది.

టై ముడిని చేతితో కదుపుతూ అన్నాను. "ప్రతాప్ నేపాల్ కొండల్లోనే హాయిగా ఉంటాడనుకుంటాను. నాగరికంగా చెడిపోవడం కంటే—"

"నా తప్పు లేదంటాడు బద్మాష్. ఇంట్లోనే, యిలాంటి పనులు చేస్తాడా?"

"కొండల్లోనే సుఖంగా ఉంటాడు. అదే మంచిది." అన్నాను. సలహా.

లలితాదేవి గంగ వేపు చూస్తూంది. పచ్చటి మెడమీద కాంతి. లేత బంగారపు రంగు జుత్తు.

"పారడైజ్ లాస్ట్ కొంచం మిగిలిపోయింది. ఒక ఏభయి లైన్స్?"

గంగ నుంచి చూపులు మరల్చి అంది విసుగ్గా, "ఇవాళేమీ వద్దు."

మళ్ళీ అంది, నాకుకోపం వస్తుందేమో అని. "మీ సంగతి చెప్పండి. యూనివర్సిటీ విశేషాలేమిటి?"

పెంకితనం కళ్లల్లో మెరిసింది. "అమ్మాయిలు అందరూ మీ కోసమే క్లాసులకి వస్తారని రాణా అంటాడు."

ఇటువంటి మాటలకి రెండే జవాబులు నావి. "అవును. రోజుకో అమ్మాయిని నా ఛేంబర్‌కి పిలిచి మానభంగం చేస్తుం

టాను.'' అప్పుడప్పుడు దీన్ని తిప్పి అంటాను. "నా గదికి రోజుకో అమ్మాయి వచ్చి నా మానాన్ని భంగం చేస్తుంది.''

రెండో జవాబు యిచ్చాను. లలితాదేవి పకపక నవ్వుతో గది నిండిపోయింది. అవతల దీపాలు ఒక్కొక్కటీ వెలుగుతున్నాయి. మిణుగురు పురుగుల్లాగ మెరుస్తున్నాయి. లలితాదేవి ఒళ్ళు విరుచుకుంది. రాణా పొట్టికాళ్ళు పిస్టన్లలాగ ఆడిస్తూ వచ్చాడు, ''ఎక్స్క్యూజ్ మి'' అంటూ.

''ఇవాళ మీ గురువుగారికి మూడ్ బాగులేదుట. పాఠం చెప్పడం లేదు. ఎవరో అమ్మాయి వచ్చి ఆయన మానభంగం—''

రాణా కూర్చున్నాడు. ఏపిల్ తీసి చాకుతో ముక్కలు చెయ్యడం మొదలుపెట్టాడు. నవ్వితే రాణా కళ్ళు కనిపించవు. నవ్వేడు.

''గురువుగారికి ఆత్మరక్షణ శక్తి చాలా ఎక్కువ. ఆయన్నెవరూ ఏమీ చెయ్యలేరు. కళ్ళల్లో బాకులు పెట్టుకుని మనుషుల్ని దూరంగా ఉంచగలరు.'' అన్నాడు. రాణా ఒకప్పుడు, నా స్టూడెంటు గాబట్టి, నన్ను ఎప్పుడూ 'కాపాడాలని' అతని ఉద్దేశం.

ఏపిల్ ముక్క నోట్లో వేసుకున్నాడు. నేను తిననని తెలుసు.

''ఆదివారం పిక్నిక్ జ్ఞాపకం ఉంచుకుంటారు కదూ. మీ స్టూడెంట్ల గుంపుని ఆదివారం మాత్రం మిమ్మల్ని అల్లర పెట్టవద్దని చెప్పండి.'' అంది లలితాదేవి. నిజానికి ఒక మెట్టు మీదుగా నడుస్తుంది.

''నా దగ్గరికి ఏ గుంపూ రాదని రాణాకి తెలుసు.''

''గురువుగారు పాప్యులర్ కాదు. ఏదో మాలాంటి అదృష్టవంతులు'' అన్నాడు రాణా నవ్వుతూ.

''నేనింక వెళ్తాను. మీరు క్లబ్‌కి వెళ్తారా?'' అన్నాను, లేస్తూ.

''మిమ్మల్ని కార్‌లో దిగబెట్టి, తరువాత.'' రాణా అన్నాడు.

''వద్దు. అలా ఘాట్స్ వేపు నడుస్తాను.'' అని, పైకి దారి తీశాను. వెనక్కి తిరిగి లలితాదేవితో అన్నాను. ''రేపు కూడా నీ మూడ్ బాగాలేకపోతే కాలేజీకి ఫోన్ చెయ్యి.''

''సరే'' అంటూ 'రాణివాసం' లోకి సాగిపోయింది.

పైకి వచ్చిన తరువాత రాణా అన్నాడు: ''చదువు సరిగా అవడం లేదనుకుంటాను. లేనిపోని బెడద పెట్టుకుంది. మీకు శ్రమ అవుతూంది అనవసరంగా—''

జేబులోంచి సిగరెట్ కేస్ తీశాను.

రాణా జేబులోంచి కవరొకటి తీసి తొందరగా గడబిడగా నా కోటు జేబులో పెట్టాడు, ఏదో గొణుగుతూ. అనవసరం అని అనడం అనవసరం. ప్రతిఫలం అన్నిటికీ ఉంది. ఒకప్పుడు త్వరగానే. ఒకప్పుడు చాలాకాలం తరువాత. 'థాంక్స్' అన్నాను అలనటగా. కవరు నా జేబులో పెట్టాక రాణాకి బాధ తగ్గింది. ''ఎంత దాకా'' అని అడిగాడు.

'దశాశ్వమేధ్ దాకా. ఆ తరవాత యింటికి త్వరగా వెళ్ళాలి. రాత్రి మొగల్‌సరాయ్ వెళ్ళాలి.

'గుడ్‌నైట్' అని మెట్లు దిగి, గల్లీలో నడవడం మొదలు పెట్టాను.

దగ్గరగా, పక్కపక్కగా, ఎత్తుగా, పాతబడిన మేడలు. తెరిచి ఉన్న ద్వారాల్లోంచి దూరంగా, లోతుగా చీకటి. రాతి పలకల రోడ్ మీద ముసుగు వేసుకుని మందంగా నడిచిపోయే బెంగాలీ విధవలు. గంగ వేపు మేడల మీద ఎక్కడి నుంచో గట్టిగా హాయిగా నవ్వు. జేబులోంచి కవరు తీశాను. అయిదు వందరూపాయల నోట్లు, మడిచి పెట్టి. కవరు కింద పారేసి, నోట్లు కోటు లోపల జేబులో పెట్టుకుంటుంటే ఒక్కసారి వెకిలినవ్వు వచ్చింది. సాధారణంగా నవ్వురాని నాకు ఆ నవ్వు విని ఆశ్చర్యం వేసింది. పెదవులు తడుముకున్నాను—దశాశ్వమేధ్ ఘాట్. చీకటి పడింది బాగా. గంగలో ఇంకా స్నానాలు చేస్తున్నారు చలిలో. దూరంగా పడవలో భజన పదాలు. గంగ మౌనంగా ప్రవహిస్తూంది, జీవితానికి అర్థం ఏమిటని ప్రశ్నలు లేవదీస్తూ. జవాబులు వెతకటం మానేసి చాలాకాలం అయింది. తవ్వుకున్న కన్నాల్లో, బొరియల్లో నివసించే జంతువుల్లాగ ఉంటే? జీవితంలో 'పేషన్' పోయింది నాకు. కారణాలు? ఎప్పుడో గట్టిగా మూసేశాను తలుపులు. కాని, తెరుచుకుంటాయి ద్వారాలు మళ్ళీ. సుఖంగా ఉన్నానా నేను?

'ప్రశ్న చాలా బాగుంది' అనుకున్నాను, వెనక్కి తిరిగి నడుస్తూ. చలి ఎక్కువయింది. బెంగాలీ రెస్టారెంట్‌లో 'మోషాయి'ల హైరోడ్ క్రాపులు ఎగురుతున్నాయి వేడివేడి వాదనలతో. గార్డినాల్ మాత్రలు అయిపోయాయని జ్ఞాపకం వచ్చింది. 'డే' కంపెనీ షాపులోకి వెళ్ళి ఒక సీసా కొన్నాను. నీలి దీపాల వెలుగులో పేర్చిన సీసాలు. మందుల పేర్లు కొన్ని రొమాంటిక్‌గా...ఎలిక్సిర్ వెలిరియన్ బ్రోమ్... కొన్ని, జబ్బుల పేర్లు యిముడ్చుకుని, బద్ధకంగా...

పైకి వచ్చి నడక సాగించాను. చౌక్‌లో నిలబడ్డాను, జేబులో నోట్లు మెల్లగా కదుపుతూ. మేజోళ్ళు కొనాలి. లాలిమ్లీ షాపు. రద్దీగా ఉంది. కొంచం లోపలకి వెళ్ళి నిలబడ్డాను. సేల్స్‌మెన్ అందరూ పులెక్ బట్టలు గుట్టలు గుట్టలుగా పడేస్తున్నారు కౌంటర్ మీద. నా మేజోళ్ళు ఎవరు చూస్తారు? పక్కనున్న నిలువుటద్దంలో టై సరిచేసుకొని, చేత్తో జుత్తు సరిచేసుకుంటుంటే వీపు మీద చెయ్యి పడింది. అద్దంలోనే చూశాను శేషాచలపతిని. నా తలమీద నాలుగంగుళాల పైగా అతని ముఖం, నవ్వుతూ. వెడల్పుగా దేహం. ఆలివ్ గ్రీన్ జెర్కిన్. వెనక్కి తిరిగాను.

శేషాచలపతి నవ్వుతున్నాడు. నవ్వితే అమాయకత్వం, కళ్ళల్లో. సన్నటి పెదవుల్లో క్రూరత్వం. గ్రీక్ నుదురు! ఎత్తుగా వెడల్పుగా. పైకి దువ్విన జుత్తులో ఒక చిన్నభాగం కావాలాగా ముందుకు వచ్చి నుదురు మీద పడి ఉంది.

నవ్వుతూనే అన్నాడు. "ఏమిటిలాగ పబ్లిగ్గా, నార్సిసస్‌లాగ అందం చూసుకుంటున్నారు?''

"నా కాంప్లెక్స్‌లన్నీ పరిశోధింపవుగా ముందే. దీన్ని కూడా కలుపు లిస్టులో'' అన్నాను.

"మేజోళ్ల జత దొరకడం లేదు."

శేషూ మనుషుల్ని తోసుకుని ముందుకి వెళ్లాడు. కౌంటర్ మీద గట్టిగా చేత్తో కొట్టి ఏదో అన్నాడు. మూడు నిమిషాల్లో నా వేపు ఒక సేల్స్‌మన్ పరుగెత్తి వచ్చి నా మేజోళ్ల సంగతి కనుక్కున్నాడు. తొందరగా నా సైజుది కొని, 'పద' అన్నాను శేషాచలపతితో.

'ఎక్కడ్నుంచి వస్తున్నారు?''

"రాణా యింటి నుంచి. నువ్వు?''

"పార్టీ మీటింగ్ రెండు గంట్లకి మొదలుపెట్టాం. అరగంట క్రితం ముగిసింది'' నా కళ్లల్లోకి చూస్తూ మెల్లగా, 'అదంతా కొత్వాలీలో రిపోర్ట్ చేసి వస్తున్నాను'' అన్నాడు.

కెమేరా కన్ను నిశ్చలంగా చూస్తుంది. అంతా ఒకటే దానికి.

"ఎక్కడకు వెళ్తావు?''

"'అవతలి గట్టుకు' అని మేటర్‌లింక్ అన్నట్లు అనాలని ఉంది. కాని నిజంగా 'ఇన్‌ఫర్నో'లోకి. అలంకారాలు తీసి చెప్తే అంటే 'సంగం' బార్‌కి. మీరు కూడా దయచేసి వస్తానంటే—''

"ఇవాళ రాలేను. థాంక్స్.''

"అయితే మీతో మాట్లాడ్డం వృధా.'' అని గిరుక్కున తిరిగి పెద్ద పెద్ద అడుగులు వేసుకుంటూ నడిచిపోయాడు సంగం బార్ వేపు. ఇటూ అటూ వంగుతూ నడుస్తాడు: అప్పుడప్పుడు తల ఎగరవేస్తాడు.

మేజోళ్ల జత చేతిలోనే ఉంది. వెచ్చగా, గరుకుగా, లేత నీలిగా. మెదడులో ఏ మార్దవమూ భావాన్ని లేపిందోగాని, గబగబ శేషాచలపతి వెనకే నడిచాను. అప్పటికే లోపలికి పోయాడు. బెనర్జీతో టేబిల్ మీద వంగి మాట్లాడుతున్నాడు. వెళ్లి, వీపు మీద చెయ్యి వేశాను. తిరగకుండానే అన్నాడు "మీ అడుగుల చప్పుళ్లు నా గుండెలో.. జాగిలం లాగా వెంటాడుతూ వస్తారని తెలుసు. పదండి లాన్‌లోకి.''

"కాదు. వేరే పని ఉంది.''

బెనర్జీతో అన్నాను."ఓల్డ్ స్మగ్లర్ బాటిల్ ఒకటియ్యి"

"హో. హో. గురువుగారు యివాళ రాయల్ మూడ్‌లో ఉన్నట్లున్నారు. వారణాసికి ఎరుపురంగు పూస్తారు. నాచేత కూడా కొంచెం పూయిస్తారు.''

బెనర్జీ లోపలకి వెళ్లాడు.

"గురువుగారు సీసా అంతా ఖాళీ చేసినా తొణకరని నీకు తెలుసు. ఆరు పెగ్గుల తరవాత నిన్ను కంట్రోల్ చెయ్యడమే కష్టం.''

"యీవిల్ ఏంజల్ లాగా మీరు కాపాడుతూంటే ఏ భయమూ లేదు యీ అలఖ్ నిరంజన్‌కి.''

"జాగిలం..యీవిల్ ఏంజల్.. ఇంకా ఏమిటి?''

"నాలుగు పెగ్గుల తరవాత చెప్పగలను.''

బెనర్జీ కాగితంతో చుట్టి తీసుకొచ్చాడు. డబ్బు ఇచ్చాను. పైకి వచ్చాం.

"ఎక్కడ పట్టేద్దాం?'' అన్నాడు.

"ఇంటి దగ్గర. పద.''

రిక్షా మీద యింటికి వచ్చాం.

పరశూ వరండాలో కూచుని పాట పాడుతున్నాడు.

శేషూ సోఫాలో కూచుని, కాగితం విప్పి, బాటిల్ తీసి నిమిరాడు.

"ఓల్డ్ స్మగ్లర్. గొప్ప నగిషీ మనుషులు మీరు'' అని, నా చేతికి యిచ్చాడు.

"పదిగంటల దాకా యిక్కడ. తరవాత క్రెమొయిన్‌లో'' అన్నాను బాటిల్ కార్కు విప్పుతూ.

"పదిగంటల దాకా యిక్కడ. తరవాత క్రెమొయిన్‌లో. ఏదో మిస్టరీ. ఏ క్రెమొయిన్?''

చెప్పాను కల్యాణి రావడం సంగతి

"నేనూ వస్తాను.''

"మీ వార్డెన్ పర్మిషన్?''

"వాడికి మూడునెలల నుంచీ జీవిత రహస్యాలు చెపుతున్నాను. నూరిపోస్తున్నాను. ఇప్పుడు కొంచెం జ్ఞానం వచ్చింది. మీ బెడ్‌రూమ్‌లోకి పదండి. ఇక్కడ చాలా కలర్‌లెస్‌గా ఉంది. తలుపు తోసుకుని లోపలకు వెళ్లి నిలబడ్డాడు, చీకటిలో. వెనకనే వెళ్లి స్విచ్ వేశాను. చుట్టూ చూశాడు.

"బ్లూ బియర్డ్ రహస్య మందిరం. లార్డ్ బైరన్''

"మధ్యవయస్సులో ఉన్న ప్రొఫెసర్, రంగులేని జీవి—''

"మీది మధ్యవయస్సు కాదు. మీరు ప్రొఫెసరేగాని, మీది పెర్షియన్ పాషాల మనస్సు. రంగులు''—మంచం పక్కన టేబుల్ మీద ఉన్న కల్యాణి ఫోటో చూశాడు శేషాచలపతి— "రంగులు మజాగా ఉన్నాయి.ఈ మిసమిసలాడే 'రంగు' ఎవరు?'' దగ్గరగా వెళ్లి ఫోటో ఫ్రేమ్ పైకెత్తి నిదానంగా చూశాడు. "కళ్లు పెయింట్‌వి. పెదవులు సిన్నర్‌వి. మిగతా అంతా సిన్నింగ్ ఫ్లెష్''. ఫోటోని దాని స్థానంలో జాగ్రత్తగా పెట్టి నా వేపు తిరిగాడు.

బాటిల్ అతనికి యిచ్చి కిచెన్‌లోకి వెళ్లాను. పరశూ వంట ప్రయత్నంలో ఉన్నాడు. "చపాతీలు, టోమాటో కొఫ్తా చెయ్యి. ఇద్దరికి.'' రెండు గ్లాసులు, వాటర్ జగ్ తీసుకుని వచ్చాను. శేషూ మంచం మీద కూర్చున్నాడు, వంగి జోళ్ల లేసులు విప్పుకుంటూ. గ్లాసులూ, జగ్గూ టేబుల్ మీద పెట్టి, బెత్తు కుర్చీ మంచం దగ్గరగా లాగి కూచున్నాను. జోళ్లు, మేజోళ్లు విప్పి, కాళ్లు జాపి, కాలివేళ్లు కిందా మీదా కదిపాడు.

గ్లాసుల్లో సగందాకా పోశాను ఓల్డ్‌స్మగ్లర్. ఒకగ్లాసు అతని వేపు జరిపాను.

"సాఫ్ట్ డ్రింక్స్ లేవు. నీళ్లు''

కొంచం నీరు జగ్ వంచి పోసుకున్నాడు. వాది నిండా నింపాడు. గ్లాసులు ఎత్తేం.

"ఈ మీ'రంగు' హెల్త్‌కి మొదట." అన్నాడు గ్లాసులు టచ్ చేస్తూ.

"ఆల్‌రైట్. ఆ నా'రంగుకి'."అన్నాను. సిప్ చేసి గ్లాసులు టేబుల్ మీద పెట్టాం.

"గురువుగారి రుచులు అద్వితీయమైనవి. 'పాపం' చెయ్యాలంటే, మీతో కలిసి చెయ్యాలి. పాండే మూడునెల లయినా రమ్, బీర్, జిన్ అంటాడు యింకా. చెడ్డ కంజూస్ గాడు."

గ్లాసు ఎత్తి సగందాకా తాగాడు.

"సుపర్బ్. నలభయి మూడులో ఏడెన్‌లో రాత్రంతా తాగాను ఓల్డ్‌స్మగ్లర్. ఆ జీవితం వేరు. ఇక్కడ యింతమందికి శిక్షణ యిచ్చాను. రమ్, జిన్, బీర్' డబ్బు లెక్కపెట్టుకుని వస్తారు సంగంకి. బాస్టర్డ్స్."

జెర్కిన్ జేబులోంచి సిగరెట్‌పాకెట్ తీసి, సిగరెట్లు రెండు పైకి తీసి, ఒకటి నాకు యిచ్చి, వెలిగించి, తనొకటి వెలిగించాడు. కిటికీ అంచు మీద ఆష్‌ట్రే ఉంది. లేచి కిటికీ దగ్గరకు వెళ్లాను. కారు చీకటిగా ఉంది పైన. అవతలి ఒడ్డున చిన్నదీపాలు మూడు కనిపిస్తున్నాయి. పడవ దిగి ఒడ్డుకు చేరిన మనుష్యుల మాటలు దూరాన్నుంచి అస్పష్టంగా వినిపిస్తున్నాయి. ఆష్ ట్రే పట్టుకుని వచ్చి టేబుల్ మీద పెట్టాను. గ్లాసు ఎత్తి సిప్ చేసి, అలాగే నిలబడి శేషాచలపతి వేపు చూశాను.

అతను 'చదువు' కోసం యూనివర్సిటీలో చేరలేదు. యుద్ధం అయిన తరవాత కెప్టెన్‌గా డిమాబ్ అయి, ఎక్కడికి వెళ్లడానికీ ఎవరూ, ఏ ఊరూ, ఏ'యిల్లూ' లేక,ఉద్యోగంచెయ్యడం యిష్టంలేక, హోటల్స్‌లో ఎల్లప్పుడూ ఉండడానికి తగినంత డబ్బులేక, యిక్కడ చేరాడు. యూనివర్సిటీలో జీవితం 'చవక'. పదిహేను రోజుల్లో, నన్ను కలుసుకుని, నా 'గురుత్వాన్ని' 'స్నేహం' లోకి మార్చాడు. అతని దోవలో తగిలిన వాళ్ల జీవితాల్లో ఒక మలుపు తిప్పిస్తాడు. అతని ధాటి తట్టుకోవడం కష్టం.

"మీరు హెమింగ్‌వే హీరోలాగ టఫ్‌గా అలా నిలబడి ఏమీ మాట్లాడకపోతే యీ 'రంగు' వ్యవహారం ఏమిటో తెలి యదు."

జీవితంలో ఎప్పుడోకాని సమయాలు రావు, మనుష్యుడి శక్తినంతటినీ పరీక్షించేందుకు. ఆ సమయాల్లోనే నిద్రకళ్లతో జవాబు లిచ్చానా? ఇచ్చిన జవాబులు, చేసిన పనులూ, వాటి అర్థా లను వెతుక్కోవడం.. ముళ్లు బిగుస్తాయి. విప్పబోతే యింకా గట్టిగా....

"బలహీనత అను. ఆ రంగు వ్యవహారం ఏమిటో చెప్పాలి కదూ నీకు."

మళ్లీ సిప్ చేసి ఖాళీ గ్లాసు టేబుల్ మీద పెట్టాను.

"ప్రేమ యిదీ అని చెప్పదలిస్తే దాన్ని ప్రేమే అను. కల్యాణి ఇంట్లో తను పొందిన స్వేచ్ఛని నాతో దుర్వినియోగించ బోయింది. శృంఖలాల క్రౌర్యం ఎంతో, స్వేచ్ఛ కూడా అంత భయంకరంగానూ ఉంటుంది. తన స్వేచ్ఛ, స్వాతంత్ర్యం గొలుసు లతో నన్ను కట్టేయాలని ప్రయత్నించింది. ఆ పరీక్షా సమ యంలో నేను మనుష్యుడిగా ప్రవర్తించి ఉంటే—"

"అంటే, యీ స్ప్రింగ్ మంచం మీదా?" అడ్డంగా అడిగాడు శేషాచలపతి, తెల్లటి దుప్పటి మీద పొడుగాటి వేళ్లు బలంగా రాస్తూ.

గ్లాసులు నింపేను. శేషూ నీళ్లు పోశాడు కొంచం.

గ్లాసు తీసుకొని కిటికీ దగ్గరగా వెళ్లాను. గంగ చప్పుడు లేకుండా ప్రవహిస్తూంది చీకట్లో. జాగ్రత్తగా వింటే కెర టాలు ఒడ్డున చేసే చిన్న చిన్న శబ్దాలు వినిపిస్తాయి—ఏదో కూడబలుక్కుంటున్నట్లు. ఆగస్టులో గట్లు తెంపుకుని, అస హ్యంగా, బురద రంగు పులుముకొని పొలాల మీద, రోడ్ల మీద నిలబడుతుంది.

కల్యాణి కళ్లల్లోని అమాయకత్వం, శేషూ అన్నట్లు, పెదవుల్లోనూ, దేహంలోనూ రద్దు అయిపోయింది.

"—అవును. నువ్వు అన్నట్లు ఆ స్ప్రింగ్ మంచం మీదే నేను మనుష్యుడిగా ప్రవర్తించి ఉంటే కల్యాణి జీవితం యింకో బాటలోకి వెళ్లేది."

"ఏమిటా బాట?"

"ఏమిటా బాట? నాతో జీవితాంతం ఉండేది. ఈ నా 'పురుష' జీవితానికి ఆ 'స్త్రీ' రంగులు కలిసేవి. ఆ తెల్లటి దుప్పటి మీద ఎంబ్రాయిడరీ పువ్వులు ఉండేవి. ఉదయం లేచే టప్పటికి కల్యాణి తల, నలిగిన పువ్వులు ఉండేవి. అవతలిగదిలో గాజులు గల గల మనేవి, అనుకోని సమయాల్లో మత్తెక్కిస్తూ. ఈ గదిలో దీపం కాంతిలో తివాసీ మీద కూర్చుని సితార్ వాయిస్తూంటే, నేనీ కిటికీ లోంచి పైని ఆవరించిన చీకట్లోకి చూస్తూ, యీ గది, యీ యిల్లు, యీ దీపం, సితార్, సితార్ వాయించే కల్యాణి— 'యివన్నీ నావి' అని, పైనున్న చీకటిని—"

"ఒక్క మాటలో చెప్పాలంటే, మీజీవితం బద్దలయి ఉండేది అవునా?" అన్నాడు శేషాచలపతి గ్లాసు కింద పెట్టి, ఎరుపు గీరలతో నిండిన కళ్లతో చూస్తూ.

ఓల్డ్ స్మగ్లర్ ఇటుకల్లాంటి మాటలకు ప్రాణం పోస్తుంది. ఎన్నో అడ్లు, ఆటంకాలు ఎగిరి పోతాయి.

"నా జీవితం బద్దలయి ఉండేది." అన్నాను ఓల్డ్ స్మగ్లర్‌ని గ్లాసులో మెల్లగా కదుపుతూ.

"కాని మీరు భద్రంగా తప్పించుకుని, కల్యాణిని—',

— కల్యాణిని మహంతి చేతుల్లోకి చేతులారా పంపిం చాను— మహంతి క్రౌర్యానికీ, అరాచకానికీ కల్యాణిని బలి—

చేశానా? తను ఎంచుకుంది. నా బాధ ఏమిటి? ఎంచుకున్న జీవితం సుఖం యివ్వకపోతే, ఆ బాధపడే వాళ్లను చూస్తే నాకు — నాకు ఏమిటి?

కిటికీ లోంచి చూశాను. చీకటిలో గంగ.

చీకటి ఘనీభవించుతూంది.

గుండెలో కరుడు కట్టిన 'దయ' మెల్లగా దహిస్తుంది.

ఉపయోగంలేని 'దయ' ఎందుకు?

— చాలా బాధ. అది నావల్లనే అయితే? చిత్రవధ చేస్తూంది. ముక్తాదేవి ఆరాత్రి అడిగింది. అన్నిటినీ, అందరినీ అర్థం చేసుకోగల ముక్తాదేవి తన కల్యాణి మనస్సునీ, ప్రవర్తననీ అర్థం చేసుకోవడంలో పొరపాటు చేసింది. అప్పటికే చాలా ఆలస్యం అయిపోయిందని తెలియదు. నా 'పొరపాటు' కల్యాణిని నానుంచి చాలా దూరం చేసివేసిందని ముక్తాదేవికి తెలియలేదు. కల్యాణి నన్ను అర్థం చేసుకోలేక, నేను తన అమాయకత్వానికీ, నైర్మల్యానికీ యిచ్చిన గౌరవాన్ని గ్రహించలేక, విసుగుతో, నామీద కోపంతో వెనక్కి తిరిగి, నేరుగా మహంతి చేతుల్లోకి వెళ్ళిందని తెలియదు. ముక్తాదేవి వాత్సల్యాన్నీ, చూపించిన ఆదరణనీ ఎలా గౌరవించాలో నాకు ఆరాత్రి బోధపడలేదు. మఱ్ఱిచెట్టు నీడల్లో, పైన గబ్బిలాలు వికటంగా రొద చేస్తూ ఉంటే, ముక్తాదేవి కళ్ళల్లోకి చూస్తూ, వణుకుతున్న చెయ్యిని పట్టుకుని —

"మధ్య వయస్సు నాది. కల్యాణికి యిరవయి రెండేళ్ళు." అన్నాను కుడికాలు జోడు నేలమీద రాస్తూ.

ముక్తాదేవి నవ్వింది.

"పెద్ద ఓల్డ్ టెస్టమెంట్ ప్రాఫెట్ లాగ మాట్లాడుతున్నావు. నీ వయస్సెంతో నాకు తెలియదా?"

"ముప్ఫయి నాలుగు. కాని అరవయి ఏళ్ళ మనిషిని మనస్సులో."

"అదికాదు నీ అసలు కారణం."

నిజం చెప్పడం ఎంత కష్టం.

"ఇంకెవరి నేనా—" అంది, దీనంగా.

"అవును" అన్నాను, ఆ మఱ్ఱిచెట్టు నీడల్లో, గుండెలు బ్రద్దలయ్యేలాగ, దారుణంగా అబద్ధం చెబుతూ.

ముక్తాదేవి నిట్టూర్చింది —

శేషాచలపతి జవాబుకోసం చూస్తున్నాడు. చలిగాలి వీయడం మొదలు పెట్టింది. గ్లాసు ఖాళీ చేశాను.

"— భద్రంగా తప్పించుకున్నాను. అవును. కల్యాణిని గాలికి వదిలివేసి." అన్నాను,

ముక్తాదేవి నిట్టూర్పు లాగ గాలి వీస్తూంది.

ముక్తాదేవిని గౌరవించలేకపోయాను. ఆ తరువాత, నాలుగో రోజునే కల్యాణి మహంతితో 'లేచి' వెళ్ళిపోయింది— తన స్వాతంత్ర్యాన్నీ, స్వేచ్ఛనీ, యవ్వనపు నిరంకుశత్వాన్నీ, అమాయకత్వాన్నీ, నామీద కోపాన్నీ భయంకరంగా ప్రదర్శిస్తూ. ముక్తాదేవి రెండు నెలలలోగా చనిపోయింది. కల్యాణి రాలేదు.

శేషూ గ్లాసులు మళ్ళీ నింపబోయాడు.

"వద్దు. పరశూ ఖానా తయారుచేసి వుంటాడు. కాస్త తిందాం" అన్నాను.

'పరశూ!' అని శేషాచలపతి కేక వేశాడు.

పరశూ వచ్చి తలుపు నానుకుని నిలబడ్డాడు.

"తయారయిందా?"

తల వూపాడు.

డైనింగ్ రూమ్‌లోకి వెళ్లాం. టొమాటో కోఫ్తా వేడిగా ఆవిర్లు కక్కుతూ గిన్నెల్లో తీసుకొచ్చి టేబుల్‌మీద పెట్టాడు. చపాతీలు ప్లేట్లల్లో పట్టుకొచ్చాడు.

"లవ్లీ. పరశూ వుంటే కాంగో అడవుల్లో కూడా సుఖంగా ఉంటుంది. క్రిందటిసారి చికెన్‌తో ఏదో తయారు చేశాడు. ఆ రుచి మజా ఇంకా నాలుకమీద ఉంది. మా మెస్సుల్లో చాలా చిత్రంగా ఉంటుంది."

నా మనస్సు సంతోషంతో నిండిపోయింది. పరశూకి వచ్చిన కాంప్లిమెంట్లు నన్ను గర్వంతో నింపుతాయి.

చపాతీ మధ్య ఎర్రటి టొమాటోని పెట్టి, చుట్టూ మడిచి, ఏకంగా నోట్లో పెట్టుకుని నమలడం మొదలుపెట్టాడు శేషూ. కుడి బుగ్గ బెలూన్ లాగ ఉబ్బింది.

నక్కలు అరుస్తున్నాయి దగ్గరగా, చలిలో. అనాథల్లాగ ఏడుస్తున్నట్లు అరుపులు. అరుపుల చివర్లో వెక్కిరింతలు.

రెండో చపాతీ తింటుంటే దీపాలు ఆరిపోయాయి. పరశూ లోపల ఎక్కడో వెతికి రెండు పెద్ద కొవ్వొత్తులు పట్టుకొచ్చాడు. వెలిగించి సాసర్లలో పెట్టి తీసుకువచ్చాడు.

"స్ప్లెండిడ్. కేండిల్ లైట్ కాంతిలో, ఎఱ్ఱటి టొమాటో కోఫ్తా తినడం ఒక అనుభవం. చచ్చేటప్పుడు ఆఖరి నిమిషాల్లో బుఱ్ఱలో మెరిసే అనుభవం" అన్నాడు శేషూ సుఖంగా, సంతోషంగా.

కొవ్వొత్తి వెలుతురు శేషూ వెనక్కి దువ్విన జుత్తుమీద పడి మెరుస్తూంది మెత్తగా, వింతగా. తలవంచి తింటూన్న అసమానమైన అందం శేషూ. మృదువైన కాంతిలో పడగెత్తి నాట్యం చేసే నాగుపాము అందం. గుండె ఒకసారి ఆగినట్లయింది ఆ అందాన్ని చూసి.

వాచ్ చూసుకుని అన్నాను. "పది గంటలయింది. ఇంక బయలు దేరాలి."

మూడో చపాతీ తిన్నాం. ప్లేట్ ముందుకు తోశాడు శేషూ. పరశూకి చెయ్యి వూపేను. వచ్చి, ప్లేట్లు గ్లాసులూ తీసుకుపోయాడు. తువాలు ఇచ్చాను శేషూకి. తుడుచుకుని లేచాడు. లేస్తూంటే ఆకుపచ్చ పాము వంపులు సాగదీసుకుని ఒక్కసారిగా లేచినట్లనిపించింది.

శేషూ డ్రాయింగ్ రూమ్‌లో సోఫాక్రింద వెతుకుతున్నాడు.

"ఏమిటి?"

"జోళ్ళు ఎక్కడో పారేశాను."

మూడు పెగ్గులమీద చపాతీలు తలకెక్కాయి.

"పద. అక్కడ. బెడ్‌రూమ్‌లో."

శేషూ మెత్తగా వచ్చాడు వెనకనే. జోళ్ళు పైకి ఎత్తి, నిలబడే మునుకులు వంచుతూ తొడుక్కున్నాడు.

ఓవర్‌కోట్ తొడుక్కోబోతూ అడిగాను.

"చాలా చలిగావుంది.నీ కేమేనా ఎక్స్ట్రాగా కావాలంటే–"

"ఇది చాలు. వాటర్ ప్రూఫ్, కోల్డ్‌ప్రూఫ్. మెసపటోమియాలో మిడ్‌వింటర్‌లో చలిలో దీనితోనే గడిపాం. ఆ చలికి తట్టుకున్న భుజాలు, చేతి కండలు చూస్తారా?"

జెర్కిన్ జిప్‌లూ, గుండీలు విప్పి తీసి పడేసి, తెల్లని బరువైన సిల్క్‌షర్ట్ చేతులు పైకి మడిచి, కుడిచెయ్యి వంచాడు. నా చెయ్యి పట్టుకుని ఉబ్బిన బైసెప్స్‌మీద పెట్టాడు.

"ఫీల్! నొక్కి చూడండి." అన్నాడు.

నవ్వేను. "డైమండ్‌లాగ గట్టిగా ఉంది" అన్నాను.

"మీవి చూపించండి." అన్నాడు ఆత్రుతగా.

స్కూల్లో జిమ్నేసియమ్ వాతావరణం. కోటు విప్పి, చెయ్యి వంచాను.

"మైటీ క్రైస్ట్! మీది కార్బొరండం, డైనమైట్ కలిపినట్లుంది. అంతా యిన్నర్ స్ట్రెంగ్త్. పైకి పలచగా, వెదురు బొంగులాగ. లోపల యిదీ" అన్నాడు మళ్ళీనొక్కుతూ.

"పద, టైమయి పోయింది."

ఒక రగ్ తీసి మడతపెట్టి చిన్న సూట్‌కేస్‌లో పెట్టాను. బాటిల్ గట్టిగా మూతపెట్టి, అమర్చాను అందులో. పరశూని పిలిచి గ్లాసులు చిన్నవి రెండు తీసుకు రమ్మన్నాను. శేషూ డ్రెస్సింగ్ టేబుల్ దగ్గర కూచుని తల దువ్వుకుంటున్నాడు. పరశూ గ్లాసులు తెచ్చిపెట్టాడు. ఒక మూలని సూట్‌కేసులో సర్ది, మూసి, వాచ్ చూసుకున్నాను. పదిన్నర అయింది.

"పద."

శేషూ లేచాడు. పైకి వచ్చాం. పరశూ గేట్‌దాకా వచ్చాడు. చీకటి గాఢంగా ఉంది. దూరంగా చెట్లల్లో చీకటి. మంచు పడుతూంది. చలికి వణుకుతున్నాయి నక్షత్రాలు. వాటి బాధలు తెలిస్తే వాటిమీద కూడా 'దయ' చూపాలా?

పొలాలగట్లమీంచి నడిచి రోడ్డుమీదకు వచ్చాం. అటూ యిటూ చెట్లు. మనుష్యుల మీద దయగలిగి, భూతాల్లాగ, మేము ఎక్కడకు వెళ్తున్నామో తెలుసుకోవాలని మమ్మల్నడుగుదామని వంగుతూ మాతో మాట్లాడుతున్నట్లు చిన్న చిన్న శబ్దాలు చేస్తున్నాయి. ఆకులు మంచునీళ్ళు రాలుస్తున్నాయి.

"అబ్బా!" అన్నాడు, శేషూ ఆగి, నేలమీదికి వంగిపోతూ.

షాక్ కొట్టినట్లయింది. పక్కకి మెరుపులాగ తిరిగి శేషూ చెయ్యి పట్టుకున్నాను.

"ఏమిటయింది? ఏమిటి?"

నాగుపాములు స్వేచ్ఛగా తిరిగే ప్రదేశం యిది.

"బెణికింది. ఘోరంగా బెణికింది. మీ రోడ్డు గతుకులు".

"అబ్బా!" అన్నాడు మళ్ళీ బాధగా.

"నడవగలవా" అన్నాను ఆతృతగా.

"డామిట్. డోన్ట్ బి సిల్లీ" అని, కోపంగా, కుంటుతూ నడిచాడు.

చెయ్యి పట్టుకుని నడుద్దామని ప్రయత్నించాను. చెయ్యి విదిల్చేశాడు. 'లంక' దీపాలు దగ్గరపడ్డాయి.

"బాప్ ఏదేనా తీసుకుందాం. మెల్లగానడు" అన్నాను.

కుంటుకుంటూ అతివేగంగా నడవడం మొదలుపెట్టాడు, నన్ను వెనక వదిలేసి. కలుసుకుందామని ప్రయత్నిస్తూ నేనూ వేగంగా నడిచాను. రెండు రోడ్ల క్రాసింగ్ దగ్గర, యూనివర్సిటీ గేట్ పక్కన నిలబడ్డాడు, ఎడమకాలు మీద బాధగా బరువు మోపుతూ. దగ్గరగా వెళ్లాను. నుదురు, ఆ చలిలో బాగా చమట పట్టివుంది. దీపం కింద......... ఎడమకాలు మీద..... శేషూ.... అమాయకత్వపు ప్రతిమ.

అరోరా డిస్పెన్సరీ తెరిచే ఉంది. వెళ్ళి అయొడెక్స్‌కొని పైకి వచ్చాను. శేషూ అలాగే శిలాప్రతిమలా నిలబడి ఉన్నాడు.

రిక్షాను పిలిచి, 'పద' అని నడిపించుకువచ్చి శేషూని కూర్చోపెట్టాను. మూలుగుతూ ఎక్కాడు. కాశీ స్టేషనుకి పోనిమ్మని రిక్షావాడితో చెప్పి కూర్చున్నాను. శేషూ కాలువెత్తి, జోడూ, మేజోడూ విప్పి "ఎక్కడ" అన్నాను. బాగా వాచి ఉంది అప్పటికే. అయొడెక్స్ రాసి, మర్దన చేస్తూ అడిగాను. "ఎలా ఉంది?" శేషూ ముఖం అటువేపు తిప్పాడు. రిక్షా చాలా జోరుగా పోతూంది.

మేజోడు మెల్లగా పైకిలాగి, జోడు తొడుక్కున్నాడు.

"బాధగా ఉన్నప్పుడు జంతువునయిపోతాను. సారీ, భాస్కర్‌గారూ" అన్నాడు సున్నితంగా చెయ్యి మీద చెయ్యివేసి.

"రేపటికి బాగా వాస్తుందను కుంటాను. రెస్ట్ తీసుకుంటే —"

"మీరలా మాట్లాడితే మళ్ళీ —" అన్నాడు విసుగ్గా.

"ఓ. కె. ఓ. కె. తిట్టకు."

చౌక్ దాటి, నీచీ బాగ్. బులనాలా. మైదాగిన్. రిక్షా జోరు ఎక్కువయింది. రోడ్డు పక్క డబ్బారేకులు, పాత గుడ్డలు, కేన్వాసు పీలికలు కలిపి గూళ్ళు కట్టుకున్న కాంది శీకులు. గూళ్ళముందు చలి మంటలు. ఆశలేని ముఖాలు, ఎఱ్ఱగా మంటల వెలుగులో.

స్టేషన్ దగ్గర అలికిడి లేదు. దిగి, మెల్లగా నడిచాం. శేషూ కాలునొప్పి తగ్గినట్లుంది. ప్లాట్‌ఫార్మ్‌లో మందంగా దీపాలు. టిక్కట్లుకొని లోపలకు వెళ్లాం. శాలువల ముసు గుల్లో మనుష్యులు. చీకట్లో మూలగా సిమెంటు బెంచీలు. ఒకటే ఖాళీ. శేషూ కూచున్నాడు. సూట్‌కేస్ తీసి బాటిల్ తీశాను. గ్లాసులు తీస్తుంటే,

"నీట్" అన్నాడు.

"బెణుకులూ, నొప్పులూ అన్నీ ఎగిరిపోవాలి."

"నిన్ను మొయ్యాలేమో ఆ తరువాత."

"భాస్కారియో! స్వీట్ భాస్కర్! మీతో యిలా ఓల్డ్ స్మగ్లర్ తాగుతూ, సుఖంగా—"

నీట్‌గా తాగడం మొదలుపెట్టాం. గంటలు. మెల్లగా రైలు ప్లాట్‌ఫార్మ్‌లోకి వచ్చింది ఏదో అనుమానపడుతున్నట్లు. ముగ్గురో, నలుగురో ఎక్కుతున్నారు. గ్లాసులు అలాగే పట్టుకుని ఎక్కేము. కంపార్ట్‌మెంట్‌లో యిద్దరమే. పాములాగ జరజర కదిలింది రైలు.

"దీపా లార్పేయండి. చీకట్లో తాగుతూ, మీతో మాట్లాడుతుంటే— అది ఒక అనుభవం."

ఒక నీలి దీపం మాత్రం ఉంచి అన్నీ ఆర్పేశాను. కాళ్ళు జాపి, గ్లాసు ఒళ్లో పెట్టుకున్నాడు. రగ్ తీసి కాళ్ళమీంచి కప్పాను శేషూకి.

"వెచ్చగా ఉంటే కాలు అంత నొప్పి పెట్టదు." గ్లాసు పట్టుకుని కిటికీ దగ్గర కూర్చున్నాను.

మాలవ్యా వంతెన. క్రింద గంగ. ఒడ్డున వారణాసి. ఘాట్లు. చీకట్లో అద్దిన దీపాలకాంతిలో ఘాట్లు. కాశీ. వంతెనమీద చప్పుడుచేస్తూ రైలు. ముఖాన్నికోస్తూ చలిగాలి. పక్కన శేషూ, కాళ్ళు జాపుకుని. చేతిలో గ్లాసు. నిండుగా నల్లగా గంగ. ఎన్ని యుగాలనుంచో ఆ ఘాట్లు. చీకట్లో యీ చక్రాలు.

శేషాచలపతి గంగవేపు వంగిచూస్తూ అన్నాడు. "ఇరవై ఏళ్ళక్రితం వారణాసికి వచ్చాను, ఒకసారి మా మామయ్యతో. అమ్మ అస్తికలు కలపడానికి."

గ్లాసు ఖాళీచేసి పక్కనిపెట్టాడు. నీలిగా దీపం పైని వెలుగుతూంది.

"చూడండి. అమ్మని నాన్న ఖూనీ చేశాడు. దేవుడి గదిలో. నా ముందు. నా కళ్ళముందు. పీకనొక్కి కింద పడేసి, నాన్న నోటిమీద చెయ్యి వేసుకున్నాడు. ఎందుకనుకున్నారు? ఆ చంపడంలో, ఆ కోపంలో పళ్ళు బలంగా నొక్కుకోవడంలో, ముందు పన్నొకటి వూడిపోయింది. చేతిలోకి ఆ పన్ను వచ్చిపడింది. ఆ పన్నుని అరచేతిలో చూసుకున్నాడు. అదే జ్ఞాపకం. దేవుడి ముందు, ఆ పూజాగృహంలో, నాన్న అమ్మని చంపి, వూడిపోయిన పన్నుని అరచేతిలో పెట్టుకుని చూసుకున్నాడు. తరవాత రుమాలుతో తుడుచుకున్నాడు పెదవుల మీద రక్తాన్ని.... మిగతా అంతా కల నాకు. రెండు రోజులు నర్మదానది ఒడ్డున పరుగెత్తాను. పోలీస్ సూపరింటెండెంట్ కాబట్టి మతలబులు. కేసు అయింది. చావులేదు. జైలు. తరువాత అదీ తప్పించుకున్నాడు. ఎక్కడినుంచో మామయ్యొకడు వచ్చాడు. అస్తికలు కలిపాం. ఇక్కడ."

రైలు వంతెన దాటి, ఏదో జ్ఞాపకం వచ్చినట్లు వేగంగా పోతూంది. ఒక్కసారిగా ఎంజిన్‌పొగ మేఘాల మేఘాలుగా వచ్చింది. నిప్పుకణాలు ఎగిరాయి.

తొమ్మిదేళ్ళ వయస్సులో, జీవితం ఏదో తలుపు తెరిచింది. చీకట్లోకి వెళ్లాడు. వెనుకనుంచి మెల్లగా, మెత్తగా, చప్పుడు లేకుండా తలుపులు వేసింది. చీకటి.

పాయింట్స్ మీద జారుతూ, పాత పట్టాలు వదులుతూ కొత్త పట్టాలమీద వింతగా చప్పుడుచేస్తూ, అర్థరాత్రి మొగల్‌సరాయ్ వెలుతురులోకి చొచ్చుకుంటూ చేరింది రైలు. దిగి, వెయిటింగ్ రూమ్‌లోకి వెళ్లాం. పడక కుర్చీ ఒకటి ఖాళీ. శేషూని కూర్చోబెట్టాను. మంచాలమీద ముగ్గురు పడుకొని ఉన్నారు రగ్గులు కప్పుకుని. రెండు నిమిషాల్లో శేషూ తల వాలిపోయింది. కాళ్ళు జాపుకుని నిద్రపోయాడు శేషూ. రగ్గు మెడదాకా కప్పాను.

పైకి వచ్చాను. ప్లాట్‌ఫార్మ్ చివరదాకా నడిచాను. బెంచీల మీద నిద్రలు. బలానికీ, సంతోషానికీ హార్లిక్స్...; నీలిగా, వెడల్పుగా 'అమృత బజార్ పత్రిక చదవండి.... 'ఖజురాహో రండి'.... ఉన్న వూళ్లోనే ఎందుకు పడి ఉంటావ్... రా. పద. ఇక్కడికి. అలాకాదు యిలా..... ఇసుక. దొంగలున్నారు..... మూసిన బుక్‌స్టాల్. నడక. మేజోళ్ళు ఒక నెల రావు. అన్నీ అరిగిపోయేదాకా నడక. ప్లాట్‌ఫార్మ్‌లో. వారణాసిలో. రోడ్ల మీద. గల్లీల్లో.... యింట్లో. . అన్నిటికీ దూరం..... అందరూ దగ్గరే...

మళ్ళీ వెయిటింగ్ రూమ్‌లోకి వచ్చాను. శేషూ కళ్లు నులుపుకుంటున్నాడు.

"మీరు షెర్లాక్ హోమ్స్‌లాగ తిరుగుతున్నారు ఓవర్ కోటు వేసుకుని. మోరియార్టీ అవతల రైల్లో ఎక్కుతాడు. మీరు పాత దొంగని పట్టుకుందామని కదులుతూన్న రైల్లో ఎక్కేస్తారు తొందరగా, పెదవుల చివర నవ్వుతూ. నేనిక్కడ కుంటికాలు వేసుకుని యీ కుర్చీలో—"

కళ్ళు మూసుకుని, తల వాల్చేడు. మళ్ళీ నిద్రపోయాడు. గోడవేపు చూస్తూ కుర్చీలో కూచున్నాను......బాల్యంలో తెరిచిన తలుపులు. పిలిచిందెవ్వరు? దేవతలు? రాజులు? హీరోలు? బంగారు రెక్కలమీద. మెరుస్తూ. వెనకనుంచి తియ్యగా, తేనెపూసుకున్న నాలికతో పిలిచే దెవ్వరు?

కుర్చీలో బాధగా ఉంది. గోడ పచ్చగా కనిపిస్తూంది. పైకి వచ్చాను. అవతల ప్లాట్‌ఫార్మ్‌లో టీ స్టాల్ దగ్గర శాలువ ముసుగులు. ఓవర్ బ్రిడ్జి ఎక్కి అటు నడిచాను. అంచులు పగిలిన కప్పులో టీ. ముసుగులు. ముసుగుల్లోంచే టీ తాగి, కప్పులు ముందుకు తోసి, విసురుగా ప్లాట్‌ఫార్మ్ చివరకి నడిచిపోయాయి.

టీ పెదవులు కాల్చింది. పన్ను పక్క చర్మాన్ని కాల్చింది. నొప్పి చెవిలోకి వచ్చింది. కుడిచేతి చూపుడు వేలితో మెల్లగా తిప్పేను. ఎంత ముద్దుగా నొప్పెటుతుంది యీ పన్ను! దేవుడికీ, దెయ్యానికీ గల సంబంధం యిది..... దీన్ని పోషిస్తున్నాను. తీయించను. అది సలపడం మానదు.

వెయిటింగ్ రూమ్‌కి రెండోసారి తిరిగి వచ్చాను. శేషూ మేలుకుని ఉన్నాడు. ఒంటిగంటా నలభయి అయింది.

"మీరు డాంటే లాగ జీవితపు లోతులు తవ్వుకుంటూ, వెతుక్కుంటూ అలా ఆ ఓవర్‌కోట్ వేసుకుని, పలచబడుతూన్న జుత్తుతో, ప్రపంచంలోని విషాదాల్నీ, బాధల్నీ భుజాల మీద వేసుకుని మొగల్‌సరాయ్ ప్లాట్‌ఫార్మ్‌మీద తిరుగుతున్నారు. మీ బియత్రిస్ మీకు ఎప్పుడో దొరుకుతుంది. నేను కుంటికాలుతో, యిక్కడ యీ కుర్చీలో సరిగ్గా నిద్ర పట్టక చస్తున్నాను. నల్లులు వీపంతా కొరికాయి." అని, మళ్ళీ కళ్ళు మూసుకుని తలవాల్చేడు.

టేబుల్ దగ్గరకు వెళ్ళి కుర్చీలో కూచున్నాను. మళ్ళీ ఎదురుగా పచ్చగా గోడ.

..... తెరిచిన ద్వారం లోంచి వెళితే ఎవరు? ఏమిటక్కడ? ద్వారాలు మూసి, వెళ్ళొద్దని చెప్పాలా? చెప్పడానికి నువ్వెవరు? నేనెవరు? అవే తెరుచుకుంటాయి. అర్ధరాత్రి స్వప్నాల్లో. ఆ కనిపించని ద్వారం తెరుచుకుంటుంది. ఎవరో పచ్చటివేళ్ళతో తట్టి లేపుతారు. లోపలకు వెళ్తావు. తలుపు మూసుకుంటుంది. చప్పుడు చెయ్యదు. అప్పుడే సీజర్, జీసస్..... జూడాస్ కూడా.

ఎదురుగా పచ్చగా గోడ పైకిపొమ్మంది. తలుపులు తెరుచుకుని పైకి వచ్చాను మూడోసారి. ప్లాట్‌ఫార్మ్ చివర దాకా నడిచాను. ఇనప ట్రాలీ ఒకటి స్తంభానికి చేరేసి ఉంది. కిందికి లాగి, యినప బద్దమీద కూచున్నాను.

—కల్యాణిని తీసుకుంటాను. నిశ్శబ్దంగా, నిర్మానుష్యంగా ఉన్న బాటలో కల్యాణి పాదాలు. మారిపోతుంది నాజీవితం. మల్లెపువ్వుల తలగడాలు. మెత్తటి దీపం కాంతిలో కల్యాణి సున్నితంగా, అమాయకంగా, ఎదురుగా. నల్లటి వంకుల జుత్తు మీద వెలుగు—

నొప్పి పెట్టాలని జ్ఞాపకం తెచ్చుకున్నట్లు పన్ను సలపడం మొదలు పెట్టింది. ఇటూ అటూ కదిపాను గట్టిగా. తేనె లాగ బాధ. దూరంగా, చీకట్లో ఒంటికన్ను రాక్షసిలాగ ఒక్కటే ఎంజిన్ నిలబడి ఉంది. పక్కనుంచి ఆవిరి వెర్రిగా వదలడం మొదలు పెట్టింది.

కుంటుకుంటూ వచ్చాడు శేషాచలపతి, నీడని చూసుకుంటూ, నీడతో ఆడుతూ.

"ఏమి టలాగ మతి లేకుండా అలా చప్పుడు చేస్తుంది ఆ ఎంజిన్? సాఫీగా, దూకుతూ పోయే కథలో అర్థం లేకుండా వచ్చే సంఘటనలాగా. పిచ్చిది. ఏమిటో దాని బాధ. 'ఎబ్సర్డ్' లోకి గెంతుతూంది అది. సుత్తి ఒకటి పట్టుకోండి. ఇనప ట్రాలీ మీద మీరు కూర్చున్నారు. లెనిన్ తాత లాగుంటారు... నల్లులే గెలిచాయి. మెడ అంతా కొరికాయి, వీపు అంతా నమిలిన తర్వాత.'

హిందీలో బూతులు తిట్టాడు కుర్చీల్నీ, హిందూ దేశపు రైల్వేస్టేషన్ల వెయిటింగ్ రూమ్‌లలో ఉన్న వాటి బంధువుల్నీ కసి. కసిగా, వెనక్కి తిరిగి కుంటుకుంటూ వెళ్ళిపోయాడు.

ఎంజిన్ ఆవిరి అల్లరి ఆపింది. నల్లగా పొగలు పైకి కక్కడం ప్రారంభించింది. కీచుగా రెండు అరుపులు అరిచింది.

కల్యాణితో జీవితం. ఎలా మొదలు పెట్టాలి? చరిత్రని మరచి, రద్దుచేసి. నాకు సులభం. కల్యాణికి? అసలు కల్యాణి —

అంచనాలూ, పద్ధతులూ, చరిత్రలూ, చరిత్రనేర్పే పాఠాలూ మరిచి, వదిలి, క్షణ క్షణం ఎదురయ్యే జీవితాన్ని ఎదుర్కొంటూ గడిపితే? ముక్తాదేవికి అప్పుడు నిజం చెప్పలేక పోయిన నేను ఇప్పుడు కల్యాణికి అబద్ధం చెప్పి, నా జీవితాన్ని మార్చుకోవాలి.

ఇంకొకరి సుఖం కోసం—

రెండూ యిరవయి అయింది.

వెయిటింగ్ రూమ్‌లో శేషూ ఆ కుర్చీలో లేడు. రెండు మామూలు కుర్చీలు కలిపి అందులో కాళ్ళు ముడుచుకుని, రగ్గు కప్పుకుని పడుకొని ఉన్నాడు. పడక కుర్చీలో కాళ్ళు జాపుకుని కూచున్నాను. అవతల అలికిడి మొదలు పెట్టింది. పాగా గుడ్డలు దులుపుకుని చుట్టుకుంటున్నారు కూలీలు.

ఎఱ్ఱటి దీపాల మధ్యనుంచి వస్తూంది నల్లటి రైలు. తెలుపూ, పసుపూ.... తలుపులు భడాలున మూసుకుంటున్నాయి ఎక్కడో.... టీ స్టాల్లో చాకులుకి తేనె పూస్తున్నాడు, కోతి టోపీ ఒకటి పెట్టుకుని. — గాలిలో పుస్తకం పేజీలు రివ్వున ఎగురుతున్నాయి.... పన్ను తీసి అరచేతిలో పెట్టుకుని చూస్తున్నాను. ఇదా... యిదా.... యిదా." అంటూ,

లేచాను. శేషూ ఎదురుగా కుర్చీలో కూర్చుని, నావేపు ఏకాగ్రతతో చూస్తున్నాడు.

"ఇంకో పది నిమిషాలుంది. ముఖం కడుక్కొని రండి. చూశారా ఎంత ఫ్రెష్‌గా ఉన్నానో" అన్నాడు బుగ్గల మీద

వేళ్ళు కిందికీ మీదికీ రాచుకుంటూ. కళ్లు మండుతున్నాయి నిప్పుల్లాగ. బాత్ రూమ్‌లోకి వెళ్లి చల్లటి నీళ్ళతో ముఖం కడుక్కుని రుమాలుతో తుడుచుకున్నాను. స్టేషన్‌లోకి దూసుకుంటూ వచ్చింది తుఫాన్. నేలా, గోడలూ అదిరాయి. రగ్గు మడతపెట్టి సూట్‌కేస్‌లో పెట్టాను. పైకి వచ్చాం. టూత్ పేస్ట్ ట్యూబ్ నొక్కితే వచ్చినట్లు దిగుతున్నారు. తొందర తొందరగా.

కల్యాణి కిటికీలోంచి చూసింది. ఆశ్చర్యం. నిజంగా మిలియన్ డాలర్ల ఆశ్చర్యం. హాయిగా నిద్రపోయి లేచినకళ్ళు. ఆ కళ్ళ అందం, అమాయకత్వం. రేగిన జుత్తు. గాయాల చిహ్నాలు లేవు ఎక్కడా ముఖంలో.

సూట్‌కేసులు దింపడం, శేషూని పరిచయం చెయ్యడం' ఎఱ్ఱ జుబ్బాల కూలీలు బరువులు మోసుకుంటూ చుట్టూ తిరగడం, కల్యాణి నా ముఖం చూస్తూ ఏదో తెలుసుకుందామని ప్రయత్నం చేస్తోందని అనిపించడం, కేకలూ, అరుపులూ, శేషూ కుడికాలు మీద బరువు మోపుతూ నిలబడి 'ప్రాడిగల్ లేడీకి సుస్వాగతం' అనడం, ఛార్మ్ అంతా వినియోగించి కల్యాణిని నవ్వించడానికి ప్రయత్నించడం, శక్తినంతటినీ కూడగట్టుకుని తుఫాన్ మూసిన కిటికీలతో బరువుగా వెళ్ళిపోతూండడం, కల్యాణి లావణ్యం, అయోమయ ప్రపంచంలో కొట్టుకుంటున్నట్లు కల్యాణి కళ్ళు కనిపించడం—

నా మనస్సులో, ఇప్పుడు పాతబడిపోయినా, ఏదో ఏ పాతకాలపు వెలుగుతో వెలుగుతాయి యిప్పటికీ.

గులాబి పువ్వులు రెక్కలు రాలుస్తున్నప్పుడు, చీకట్లో నేలమీద చూస్తూ నడుస్తున్నప్పుడు, రైఫిల్ క్లబ్‌లో, బీర్ గ్లాసులో వొంచుకుంటున్నప్పుడు, ఎత్తుగా ఆకాశంలో కదిలే లేతరంగు మేఘాల్లాగ కదలుతాయి అవి.

కాని, ఆ క్షణంలో

మూడు నెలల్లోగా, సుస్వాగతం యిచ్చిన శేషూ కల్యాణిని 'వశ'పరచుకుంటాడని, కల్యాణి పాఠాలు మరిచిపోతుందని, నాకు 'ద్రోహం' జరుగుతుందని, శేషూ ఆ తరువాత కల్యాణికి ద్రోహం చేస్తాడని, ఒక సంవత్సరంలో ఎవరి చీకటి గదుల్లోకి వారు ప్రవేశిస్తారని,

ఎఱ్ఱ జుబ్బాల కూలీలు సూట్‌కేసులు మోసుకుని ముందుగా ఓవర్‌బ్రిడ్జ్ మెట్లు ఎక్కుతుంటే, మేము వెనకనే మెల్లగా ఎక్కుతున్నప్పుడు, శేషూ బెణికిన పాదం మెల్లగా లాగుతూ, వంగుతూ నడుస్తున్నప్పుడు, కల్యాణి అతని వేపు అమాయకంగా చూస్తూ నవ్వినప్పుడు.....

నాకు తెలుసా?

అప్పుడప్పుడు అనిపిస్తుంది, నాకు అప్పుడే తెలుసునేమో అని. తెరిచిన తలుపులు మూసుకుపోతాయని, లోపలి చీకట్లలో వెనకనుంచి వీపులో బాకులు పొడుస్తాయని, అప్పుడే నాకు తెలుసునేమో అనిపిస్తుంది.

కాని,

ఘోరమైన 'సత్య' మేమిటంటే —

నా 'బాధ్యతలు' ఒక్కొక్కటే భుజాల మీంచి జారుకుని, నా 'స్వేచ్ఛ' నాకు అనుకోకుండా తిరిగి వచ్చింది. సుఖం, స్వేచ్ఛ కల్యాణి బలితోగాని నాకు రాలేకపోయా యనుకోవడం కూడా ఘోరమైన నిజమేనా? లేక, నా మనస్సు నన్ను తిప్పే మలుపుల్లో, తోసే అఖాతాల్లో ఒక —?

